**జరిగిన కథ :** ధారానగరానికి వెళ్తున్న ఏడుగురు మిత్రుల కథ ఇది. ముగ్గురు ఇప్పటికే ఆ నగరం చేరుకున్నారు. నాలుగోవాడైన కుచుమారుడు గొప్ప సిద్ధుడయ్యాడు. తన విద్య ప్రభావంతో పురందరపురాన్ని ఏలే సరస్వతిని పెళ్లి చేసుకోవాల్సి ఉంది. కానీ, మోసానికి బలయ్యాడు. బెస్తవారి వల్ల ప్రాణాలు దక్కించుకున్నాడు. అయిదోవాడైన గోనర్దీయుడు అతణ్ని కలుసుకున్నాడు.






# వేదం చదివిన రాక్షసుడు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

“అయ్యో! ఇలా చిక్కిపోయావేంటి?! అయినా మిత్రమా! నువ్వేమిటీ.. ఈ బెస్తవాళ్లతో కలిసి నావల మీద పనిచేయడం ఏమిటి?! నువ్వేమో సరస్వతిని పెళ్లాడబోతున్నావని తెలిసి, నిన్ను కలుసుకోవడానికే ఇక్కడికి వస్తున్నాను. ఆ వార్త నిజం కాదా?! అసలేం జరిగింది” అని ఆదుర్దాగా ప్రశ్నించాడు గోనర్దీయుడు.

అప్పుడు కుచుమారుడు జరిగిన సంగతులన్నీ తన మిత్రునితో పూసగుచ్చినట్లు చెప్పాడు.

“నన్ను బతికించడానికి ఆ పల్లె బెస్తవారు పడిన శ్రమను మరిచిపోలేను. పాపం.. వారు అప్పులపాలై మరీ నాకు వైద్యం చేయించారు. మరో జన్మ ఎత్తినా వారి రుణం తీర్చలేను” అన్నాడు ఆఖరుగా.

అంతా విన్న గోనర్దీయుడు ఒక్కసారి మిత్రుణ్ని కౌగిలించుకుని..

“అయ్యయ్యో! ఎంత ప్రమాదం తప్పిపోయింది?! ఆ పల్లెవాళ్లు నిజంగా మనకు ప్రాతఃస్మరణీయులు. వారినిలా తీసుకురా! వాళ్ల ఇళ్లన్నీ బంగారు మయం చేస్తా” అన్నాడు. అంతలోనే మళ్లీ..

“ఆ శంబరుడెక్కడ ఉన్నాడు?! నిన్ను చంపబోయిన ఆ కృతఘ్నుడిని నా కత్తికి ఎరవేస్తాను” అని హుంకరించాడు. కుచుమారుడు అతణ్ని వారించి..

“మిత్రమా! నేను బతికే ఉన్నాను కదా! ఊరడిల్లు. ఆ శంబరుణ్ని కాలమే శిక్షించగలదు. వాని తండ్రి చేసిన సహాయాన్ని పొందిన విశ్వాసంతోనే వాణ్ని విడిచిపెట్టాను. లేకుంటే నా మంత్రశక్తితోనే వాణ్ని శిక్షించి ఉండేవాణ్ని” అని సర్దిచెప్పాడు.

“మిత్రమా! నువ్వు పడిన కష్టాలు వింటుంటే నాకు దుఃఖం ఆగలేదు. దుర్జనులను చేరనిస్తే విపత్తు కలగక మానదు. ఆ శంబరుడు నిన్నిలా పరాభవించి, తానే కుచుమారుడినని ప్రకటించుకున్నాడు కాబోలు. అయ్యో! తొందరపడి.. తెలియక సరస్వతి వాణ్నే పెళ్లాడదు కదా!! నువ్వు చెప్పిన మాటలను బట్టి ఆమె చాలా ప్రజ్ఞావంతురాలని తెలుస్తున్నది. మళ్లీ పరీక్షించకుండా పెళ్లాడదు. సరే.. ఇంతకూ దైవసంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది” అన్నాడు గోనర్దీయుడు.

“అది సరే మిత్రమా! నీ కథ చెప్పనే లేదు. నువ్వీ రాజ్యాన్ని ఎలా సంపాదించావు?” అని ప్రశ్నించాడు కుచుమారుడు.

గోనర్దీయుడు తన కథ చెప్పడం మొదలుపెట్టాడు.

* * *

“మిత్రమా! నేను ముందుగా కాశీ నుంచి మా స్వగ్రామానికి వెళ్లాను. అక్కణ్నుంచి ధారానగరం బయల్దేరాను. నీకు తెలుసు కదా.. నాకు మొదటినుంచి అడవులంటే భయం. కానీ, ప్రయాణంలో అనేక అడవులు దాటక తప్పలేదు. నాకు తోడుగా ఎవరూ లేరు. అరచేతిలో ప్రాణాలు పట్టుకుని ఎలాగో నడుస్తున్నాను.

ఒకనాడు చీకటిపడే సమయానికి ఒక రావిచెట్టు కిందికి చేరుకున్నాను. ఆ రావిచెట్టునే భగవంతునిగా